క్లుప్తంగా

మైనర్లకు బైకిలిస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై లోవరాజు

విజయనగరం క్రైమ్: మైనర్లకు బైకిలిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు హెచ్చరించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎస్సై లోవరాజు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

వివక్ష లేని సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఓ సూర్యనారాయణ

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ రోగులకు వివక్ష లేని సేవలు అందించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్. సూర్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక యూత్ హాస్టల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హెచ్ఐవీ సోకిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు చేయాలన్నారు. రోగులు క్రమం తప్పకుండా మందులు వాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీపీఎం బాలాజీ, డీఐసీ సాక్షి గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న యువత

విజయనగరం: విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోట జంక్షన్ దగ్గర వద్ద గల విజయ బ్లడ్‌బ్యాంక్‌లో సామాజికవేత్త అబ్దుల్ రవూఫ్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. శిబిరాన్ని రవూఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తామాష్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సమైక్య అధ్యక్షుడు మమ్ములు తిరుపతిరావు, సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు గెద్ద చిరంజీవి, విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు కేశపట్నం చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



చేపలకంచేరులోని జగనన్న కాలనీలో పర్యటిస్తున్న మండల ప్రత్యేకాధికారి సుధారాణి, తదితరులు

భోగాపురం: జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి సుధారాణి అధికారులకు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులతో కలిసి మండలంలోని చేపలకంచేరు పంచాయతీ జగనన్న కాలనీలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం , నిర్మాణ సామాగ్రితో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతి ఉద్యోగికి సత్కారం



శ్రీకర్‌బాబును సత్కరిస్తున్న తపాలాశాఖ సిబ్బంది

విజయనగరం టౌన్: విజయనగరంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన ఎస్.శ్రీకర్‌బాబుకు కర్ణాటక సర్కిల్‌లో సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు తపాలాశాఖ కార్యాలయంలో ఆయనకు సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఇటీవలి కాలంలో విజయనగరం నుంచి ఆయన పార్వతీపురం అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లారు. తాజాగా శ్రీకర్‌బాబుకు పోస్టల్ ఎస్పీగా పదోన్నతి లభించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తపాలాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి ఫలితాల్లో..
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

- విజయనగరం నియోజకవర్గంలో 60.63 శాతం ఉత్తీర్ణత
- నెల్లిమర్లలో సత్తా చాటిన గ్రామీణ విద్యార్థులు



విజయనగరం రూరల్: ఏపీ మోడల్ స్కూల్

విజయనగరం రూరల్: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. విజయనగరం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు 60.63 శాతం ఉత్తీర్ణత సాధించారు. నియోజకవర్గంలోని కార్పొరేషన్ పరిధిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, కేజీబీవీ, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 15 ఉండగా, మండల పరిధిలో 4 జెడ్పీ ఉన్నత పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల నుంచి 1816 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా శనివారం ప్రకటించిన ఫలితాల్లో 1101 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఏపీ మోడల్ స్కూల్ 98 శాతం, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు 87 శాతం, సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాల, బీసీ వెల్ఫేర్ పాఠశాల 85 శాతం ఉత్తీర్ణత సాధించాయి. విజయనగరం మండలంలోని మలిచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచడంతో ప్రధానోపాధ్యాయుడు ఏపీ రమణ, మలిచర్ల, సుంకరిపేట గ్రామ సర్పంచ్‌లు రమాకుమారి, రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు నిర్మల అభినందించారు.

బాలికల హవా

నెల్లిమర్ల: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. నెల్లిమర్ల పట్టణ పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల నుంచి మొత్తం 79 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 75 మంది ఉత్తీర్ణులయ్యారు. బెల్లాన రేష్మ , దేసెట్టి మధురవాణి, ఈశ్వరమ్మ పాఠశాల టాపర్లుగా నిలిచారు. ఎంజేపీ ఏపీ మత్స్యకార బాలుర పాఠశాల నుంచి 65 మంది పరీక్షలు రాయగా 50 మంది పాసవ్వగా, కె. జశ్వంత్ ప్రతిభ కనబరిచాడు. పట్టణ పరిధిలోని రెల్లివీధి బాలికోన్నత పాఠశాల విద్యార్థిని పి. జ్యోత్స్న నెల్లిమర్ల మండల టాపర్‌గా నిలిచింది. ఈ పాఠశాల నుంచి 88 మంది పరీక్షలకు హాజరు కాగా 61 మంది పాసై, 69 శాతం ఉత్తీర్ణత సాధించారు. స్థానిక కేజీబీవీ పాఠశాల విద్యార్థుల్లో 74 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాల నుంచి 39 మందికి గాను 29 మంది పాసయ్యారు. ఎం. పూజ పాఠశాల టాపర్‌గా నిలిచింది. జరజాపుపేట పాఠశాల నుంచి 55 మందికి 42 మంది పాసై 76 శాతం ఉత్తీర్ణత సాధించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 63 మందికి 35 మంది పాసవ్వగా ఎల్. కౌశిక్ టాపర్‌గా నిలిచాడు. వేణుగోపాలపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 86 మందిలో 71 మంది ఉత్తీర్ణత సాధించగా.. జి.లావణ్య. బి. లిఖిత మంచి ఫలితాలు సాధించారు. స్థానిక గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల నుంచి 40 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 17 మంది పాసై, 43 శాతం ఉత్తీర్ణత సాధించారు.

సత్తా చాటిన గ్రామీణ విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన గ్రామీణ విద్యార్థులు సత్తా చాటారు. సతివాడ ఆదర్శ పాఠశాలలో 100 మంది విద్యార్థులకు గాను 98 మంది.. మొయిద ఉన్నత పాఠశాలలో 77 మందికి 72 మంది.. రామతీర్థం ఉన్నత పాఠశాలలో 79 మందికి 66 మంది.. కొండ వెలగాడ ఉన్నత పాఠశాలలో 74 మందికి 61 మంది.. తంగుడుబిల్లి ఉన్నత పాఠశాలలో 22 మందికి 18 మంది.. కొండగుంపాం ఉన్నత పాఠశాలలో 30 మందికి 23 మంది.. అలుగోలులో 98 మందికి 73 మంది.. బొప్పడాంలో 78 మందికి 56 మంది.. సారిపల్లిలో 56 మందికి గాను 39 మంది.. పారసాంలో 46 మందిలో 31 మంది.. సతివాడలో 80 మంది విద్యార్థులకు 37 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

పాఠశాలల టాపర్లు వీళ్లే...

సతివాడ ఆదర్శ పాఠశాలలో ఆస్రిత, దిలీప్‌కుమార్..పారసాం ఉన్నత పాఠశాలలో వినయ్.. అలుగోలు ఉన్నత పాఠశాలలో మన్మధరావు.. మొయిద ఉన్నత పాఠశాలలో అస్మిత.. కొండవెలగాడలో భవానీ.. సారిపల్లిలో అస్మిత.. రామతీర్థంలో హర్ష.. తంగుడుబిల్లిలో మహేశ్వరరావు.. సతివాడలో పావని.. కొండగుంపాం ఉన్నత పాఠశాలలో కల్యాణి మంచి మార్కులు సాధించారు.

పూసపాటిరేగలో..

పూసపాటిరేగ: పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరిశారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన చుక్క మౌనిక.. కుమిలి జెడ్పీ పాఠశాలకు చెందిన కె. శశికుమార్.. రెల్లివలస జెడ్పీ పాఠశాలకు చెందిన ఎడ్ల ప్రదీప్.. గోవిందపురం జెడ్పీ పాఠశాలకు చెందిన హిమబిందు.. వెంపడాం జెడ్పీ పాఠశాలకు చెందిన సువ్వాడ స్వాతి, పిన్నింటి దిలీప.. కోనాడ పాఠశాలకు చెందిన అదపాక నవీన్ .. పసపాం పాఠశాలకు చెందిన దుక్క నవీన్ .. పతివాడ పాఠశాలకు చెందిన పతివాడ ఝాన్సీ.. కనిమెల్ల పాఠశాలకు చెందిన వాళ్లె పవన్.. తిప్పలవలసకు చెందిన గలనగల్ల రాజు ఆయా పాఠశాలల టాపర్లుగా నిలిచారు. మండలంలో 1116 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 738 మంది ఉత్తీర్ణత సాధించారు.

70 శాతం ఉత్తీర్ణత..

డెంకాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో 70 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మోపాడ కస్తూరిబా గాంధీ విద్యాలయంలో 36 మందికి అందరూ ఉత్తీర్ణత సాధించారు. అక్కివరం పంచాయతీ గొల్లపేట ఏపీ మోడల్ స్కూల్‌లో 100 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 79 మంది..అక్కివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 46 మందికి 20 మంది.. డెంకాడ జెడ్పీ స్కూల్‌లో 58 మందికి 29 మంది.. గుణుపూరుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 49 మంది విద్యార్థులకు 30 మంది.. జొన్నాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 86 మందికి గాను 64 మంది.. మోపాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 43 మందికి 34 మంది.. పెదతాడివాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 93 మందికి 66 మంది.. రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 63 మందికి 41 మంది పాసయ్యారు. ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన గుండు తనూజ, మమంతి రాధిక, గుణుపూరు ఉన్నత పాఠశాలకు చెందిన రెడ్డి హరిణి ప్రతిభ కనబరిచారు.

ఏపీ మోడల్ స్కూల్ టాప్

భోగాపురం: పదో తరగతి ఫలితాల్లో మండలం కేంద్రంలోని ఆదర్శ పాఠశాల మొదటి స్థానంలో నిలిచింది. పాఠశాలలో 97 మంది విద్యార్థులకు గాను 92 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎం.యశ్వనిని ప్రిన్సిపాల్ పార్వతి, ఉపాధ్యాయులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం



జె.పద్మలత, ప్రిన్సిపాల్, సతివాడ ఆదర్శ పాఠశాల

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు ఈ నెల పదో తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మలత సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ, వచ్చేనెల 11న నిర్వహించబోయే ప్రవేశ పరీక్షకు ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150 పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. ఆన్‌లైన్ చేసిన దర ఖాస్తులను సతివాడ ఆదర్శ పాఠశాలకు తప్పనిసరిగా అందజేయాల్సి ఉందన్నారు. వచ్చే నెల 11న సతివాడ ఆదర్శ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

గ్రంథాలయాలలో వేసవి శిక్షణ

డెంకాడ: మండలంలోని డెంకాడ గ్రామంలో ఉన్న శాఖా గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వై.మహేష్ అన్నారు. ఈ మేరకు మండలంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిక్షణ శిబిరంలో డ్రాయింగ్, పెయింటింగ్, తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. అలాగే ఇంగ్లిష్, మ్యాథ్స్, తదితర సబ్జెక్ట్‌లలో కూడా తర్ఫీదు ఇస్తామని తెలిపారు. వారం వారం సమీక్ష నిర్వహించి ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. వచ్చే నెల 3వ తేదీతో శిక్షణ ముగుస్తుందన్నారు.

భావితరాలకు సనాతన కళలు



స్వామీజీని సత్కరిస్తున్న కోలగట్ల, తదితరులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం టౌన్: సనాతన కళల సంపదను, ఆధ్యాత్మిక భావాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఇందుకోసం పలు సంగీత, సేవా, ఆధ్యాత్మిక సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ, ఘంటసాల స్మారక కళాపీఠం సంయుక్త నిర్వహణలో శనివారం సాయంత్రం స్థానిక గురజాడ కళాభారతిలో నిర్వహించిన అన్నమయ్య జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన విద్యార్థులను అభినందించారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ, సంగీత, సాహిత్య కళలకు ఆదరణ తగ్గుతున్న ప్రస్తుత రోజుల్లో వాటికి పూర్వవైభవం తీసుకువచ్చేలా ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. రేపటి తరానికి శిక్షణనిస్తూ ప్రదర్శనలు ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. శ్రీసాయి సుందరం మహరాజ్ అందించిన ఆధ్యాత్మిక సందేశంతో పాటు 12 అడుగుల ఎత్తుగల వేంకటేశ్వరస్వామి విగ్రహం ఆహూతులను ఆకట్టుకుంది. అనంతరం స్వామీజీని దుశ్శాలువతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, తిరుపతినాయుడు, మేకా కాశీవిశ్వేశ్వరుడు, జక్కు రామకృష్ణ, డాక్టర్ ఎ.గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మహంతి కల్యాణి, తదితరులు

పూసపాటరేగ: బాల్య వివాహాలు అరికట్టాలని ఎంపీపీ మహంతి కల్యాణి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, హెల్త్ సిబ్బందితో సఖీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల్యవివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు రాయితీపై సరఫరా చేస్తామన్నారు. గ్రామాలలో ఎటువంటి నేరాలు జరగకుండా మహిళా సంరక్షణ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బి. శాంతకుమారి, ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, వ్యవసాయ అధికారి కె.నీలిమ, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సత్య ప్రభాకర్ సేవలు ప్రశంసనీయం



సత్య ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ పద్మలీల, సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో గత రెండున్నరేళ్ల కాలంలో ఎంపీఎంఎస్ఐడీసీ (ఏపీ వైద్య ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ) ఈఈగా ఎం. సత్య ప్రభాకర్ అందించిన సేవలు ప్రశంసనీయమని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల అన్నారు. శనివారం స్థానిక ఏపీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో శ్రీకాకుళం బదిలీపై వెళ్తున్న సత్య ప్రభాకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్య కళాశాలకు జాతీయ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు సాధించడంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. ఆస్పత్రుల భవన నిర్మాణం, వసతులు సమకూర్చడంలో సత్య ప్రభాకర్ క్రియాశీలకంగా వ్యవహరించారని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, పౌర సంబంధాలశాఖ ఎ.డి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

డెంకాడ: భగవాన్ సత్యసాయిబాబా తల్లి ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా డెంకాడలో ఉన్న సత్యసాయి మందిరంలో బాలవికాస్ వారోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి భక్తులు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధనలో 150 మంది భక్తులు ప్రసాదం స్వీకరించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెరకముడిదాం: గర్భాం ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.వి.ఎస్.అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 9 నుంచి 25 వరకు ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలు రూ.75/-, బీసీ, ఓసీలు రూ.150/- చొప్పున రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాలని సూచించారు. జూన్ 11న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

చీపురుపల్లి: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో మే 8 నుంచి జూన్ 11 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు శాఖా గ్రంథాలయాధికారి ఎ.బుచ్చింనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతీ రోజూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నీతి కథలు చదివించడం, స్పోకెన్ ఇంగ్లిష్, తెలుగు గ్రామర్, చిత్రలేఖనం, క్యారమ్స్, చదరంగం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పదిలో 'అభ్యాస్' విద్యార్థుల ప్రతిభ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని అభ్యాస్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థిని ఐ.నిహారిక 590 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అదే విధంగా ఎం.నిషిత 587 మార్కులు, ఎం.భువనకృతి 581, ఎస్. భవ్యసంహిత 581, సీహెచ్.సాయిసాత్విక్ 581 మార్కులతో తరువాత స్థానంలో నిలిచారు.

అట్రాసిటీ కేసు విచారణ

బొండపల్లి: మండలంలోని కనిమెరక గ్రామానికి చెందిన దళితుడుని అదే గ్రామానికి చెందిన ఇద్దరు బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు కులం పేరుతో దూషించడంతో పాటు, తనపై దాడి చేసినట్లు దళితుడు చేసిన ఫిర్యాదు చేశాడు. దీనిపై విజయనగరం ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు శనివారం గ్రామంలో దర్యాప్తు చేపట్టారు. దండా జగన్నాథం ఆవులు మేపేందుకు గ్రామంలోని మామిడితోటకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన గొర్లె సత్యారావు, పల్లి సన్యాసిరావు తనపై దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించినట్లు బాధితుడు పిర్యాదు చేశాడు. ఈమేరకు ప్రత్యక్ష సాక్షలతో పాటు ఫిర్యాదుదారుడిని విచారించి వివరాలు సేకరించారు.

సక్రమంగా సఖి గ్రూపులు



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రమణమూర్తి

- మండల ప్రత్యేక అధికారి రమణమూర్తి

నెల్లిమర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సఖి గ్రూపులను సక్రమంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి ఎస్‌వీ రమణమూర్తి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కన్వర్జెన్సీ పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీల్లోని ఇళ్లు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అనంతరం నిర్మాణంలోనున్న ఇళ్లను ప్రత్యేకాధికారి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. గిరిబాల, హౌసింగ్ డీఈ మురళీమోహన్, ఏఈ ఆర్. పవన్, ఈఓపీఆర్‌డీ హెచ్. భానోజీరావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందిస్తున్నాం..

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల



ఐసీయూను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన నూతన ఐసీయూను వారు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిరంతంర అత్యవసర వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బొత్స సంతోష్, ఆర్ఎంఓ డాక్టర్ సురేష్‌కుమార్, వైద్యులు పద్మలత, బి. పద్మావతి, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సత్యవంతుడు

- ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు

వేపాడ: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, అలాగే వ్యక్తి గత ఆరోగ్య పట్ల జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ సత్యవంతుడు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో శనివారం సఖీ గ్రూపులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సఖీ గ్రూపుల ఆవశ్యకతను వివరించారు. కిశోరీ బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని, మహిళలపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం దిశా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న లక్ష్యంతో మహిళలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ పట్నాయక్, తహసీల్దారు కృష్ణంరాజు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

బిందు, తుంపర సేద్యంతో రైతులకు మేలు



బిందుసేద్యంతో సాగుచేస్తున్న గడ్డిని పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ ప్రాజెక్టు అధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న బిందు, తుంపర సేద్యంతో పంటలు సాగుచేయటం వల్ల తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని ఏపీఎంఐపీ ప్రాజెక్టు అధికారి పి.ఎస్.ఎన్.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని వెల్దాం గ్రామంలో రాయితీపై అందించిన బిందుసేద్యం పరికరాలను, సాగుచేస్తున్న పంటలను శనివారం ఆయన పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు, తుంపర, బిందు సేద్యంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. నీటి వసతి ఉన్న ప్రతీ రైతు డ్రిప్ ఇరిగేషన్ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేపాడ ఆర్‌బీకే వీఏఏ పవన్ రైతులు పాల్గొన్నారు.